

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 26 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 95 పేజీలు : 4 వెల : రూ 3-00

# పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆరోగ్యశ్రీ సేవలు: సీఎం జగన్



అమరావతి: మనిషి ప్రాణానికి విలువనిచ్చే ప్రభుత్వం తమదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆరో రోజు ఏపీ అసెంబ్లీ సమావేశంలో భాగంగా సీఎం జగన్ ఆరోగ్య అంశంపై ప్రసంగించారు. వైద్యాన్ని పేదవాడికి అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన చెప్పారు. గతంలో ఆస్పత్రులు ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఎలా ఉన్నాయి? అనే విషయాన్ని గమనించాలని తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక మార్పులు చేశామని అన్నారు. ఆదాయ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో 90 శాతం మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందించామని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో 130 సూపర్ స్పెషాలిటీల్లో ఆరోగ్యశ్రీ వర్తింపచేశామని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీపై ఎన్నో మెలికలు పెట్టిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలో రూ. 10 లక్షల ఆపరేషన్‌ను కూడా తీసుకొచ్చామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలో గుండె మార్పిడి బైకాక్లియర్, స్టెమ్ సెల్స్ చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. 29 నెలలుగా ఆరోగ్యశ్రీపై రూ. 4 వేల కోట్లు ఖర్చు చేశామని, గత ప్రభుత్వ బకాయిలు రూ. 600 కోట్లు చెల్లించామని సీఎం జగన్ చెప్పారు. 21 రోజుల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లుల చెల్లిస్తున్నామని తెలిపారు.

**వైద్యం ఖర్చు వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు**

వైద్యం ఖర్చు వెయ్యి దాటితే ఆరోగ్య శ్రీ వర్తింపును తీసుకొచ్చామని, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిధిలో 2,446 చికిత్స అందించామని సీఎం పేర్కొన్నారు. గతంతో పోలిస్తే చికిత్సలు రెట్టింపు చేశామని వివరించారు. ఇంకా అవసరమైనవి కూడా కొత్తగా చేరుస్తామని అన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీని పట్టించుకోలేదని సీఎం తెలిపారు. ప్రతీ పార్లమెంట్ పరిధిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి.. సూపర్ స్పెషాలిటీ సేవలు అందించనున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతంలో కొత్తగా టీచింగ్ ఆస్పత్రి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఐటీడీఏ ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నామని సీఎం జగన్ చెప్పారు. గ్రామస్థాయి నుంచి సమూల మార్పులు తీసుకొస్తున్నాని తెలిపారు. నాడు-నేడు ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తున్నామని, రూ. 16,255 కోట్లలో ఆస్పత్రుల్లో నాడు-నేడు అమలు చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య శాఖలో 9712 పోస్టులు భర్తీ చేశామని, 14788 పోస్టులు వచ్చే ఫిబ్రవరిలోగా భర్తీ చేస్తామని తెలిపారు. 10,032 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్ ఏర్పాటు చేశామని, గ్రామస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకువస్తున్నామని తెలిపారు. వచ్చే 6 నెలల్లో వైద్య సంస్కరణలు అమల్లోకి వస్తాయిని సీఎం జగన్ వివరించారు.

**కోవిడ్ వైద్యాన్ని కూడా ఆరోగ్యశ్రీలో చేర్చాం**

వైఎస్సార్ కంటివెలుగు ద్వారా 66 లక్షల పిల్లలకు పరీక్షలు చేశామని, 3 ప్రాంతాల్లో కొత్తగా చైల్డ్ కేర్ ఆస్పత్రులను నిర్మిస్తామని తెలిపారు. కోవిడ్ వైద్యాన్ని కూడా ఆరోగ్యశ్రీలో చేర్చామని సీఎం పేర్కొన్నారు. కోవిడ్ అనంతర సమస్యలకు కూడా ఆరోగ్య శ్రీ చికిత్స అందిస్తున్నామని, ఏపీలో కోవిడ్ మరణాల రేటు 0.70 మాత్రమే ఉందని సీఎం జగన్ చెప్పారు. రాష్ట్రంలో కోవిడ్ వచ్చిన 99.3 శాతం మందిని కాపాడుకున్నామని తెలిపారు. కోవిడ్ పరీక్షల కోసం 19 ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని సీఎం చెప్పారు. జనాభాలో 87 శాతం మందికి ఒక డోసు వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. కరోనాతో తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు రూ. 10 లక్షలు ఇస్తున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు.

# అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన చేసిన ప్రధాని మోది





న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌గా చెప్పుకుంటున్న నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోది గురువారం శంకుస్థాపన చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్ బుద్ధ్ నగర్ జిల్లా జెవార్ ప్రాంతంలో 52 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ ఎయిర్‌పోర్ట్‌ను 10,500 కోట్లతో నిర్మించనున్నారు. ఈ ఎయిర్‌పోర్ట్ మొదటి విడత నిర్మాణం పూర్తి చేసుకున్న వెంటనే 1.2 కోట్ల ప్యాసింజర్ సామర్థ్యానికి చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలోపు అంటే 2024 లోపు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తున్నట్లు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి పునాది రాయి వేసిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ "ఉత్తరప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల కల్పనలో నవంబర్ 25వ తేదీ ప్రముఖ దినంగా ఉండిపోతుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన జరిగింది. నిర్ణయించుకున్న సమయంలోనే ఇది పూర్తవుతుంది. ఈ ప్రాజెక్టుతో వ్యాపార, పర్యాటక రంగాలకు కొత్త ఊపు అందుకుంటుంది. అలాగే అనేక రంగాలకు మధ్య అనుసంధానం పెరుగుతుంది. ఇక్కడే 40 ఎకరాల్లో ఎయిర్‌క్రాఫ్ట్ రిపేర్, ఓవరాల్, మెయింటెనెన్స్ కోసం నిర్మాణాలు జరగబోతున్నాయి. ఇక్కడి వందలాది మంది యువతకు దీంతో ఉపాధి లభిస్తుంది. రాజకీయాలు కాదు, మౌలికాభివృద్ధి అవసరం" అని అన్నారు.

# సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన బీసీ సంఘాల ప్రతినిధులు



అమరావతి: అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బీసీ సంఘాల ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ జనగణనపై శాసనసభలో తీర్మానం చేసిన సందర్భంగా సీఎం జగన్‌కు వారు ధన్యవాదాలు తెలిపి, సత్కరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశవ శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి ఆంజనేయులు, బీసీ సంక్షేమ సంఘం కోశాధికారి కన్నా మాష్టారు, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి హనుమంతరావు, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె క్రాంతి కుమార్ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. వారితో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ , ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, ఆర్ రమేష్ యాదవ్, ఎమ్మెల్యే జోగి రమేష్, ఆప్కో ఛైర్మన్ చిల్లపల్లి వెంకట నాగ మోహన్‌రావు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కుప్పం దెబ్బకు చంద్రబాబుకు పిచ్చెక్కింది: ఎమ్మెల్యే రోజా




అమరావతి: కుప్పం దెబ్బకు చంద్రబాబుకు పిచ్చెక్కిందని ఎమ్మెల్యే రోజా అన్నారు. గురువారం ఆమె అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు సీఎంగా ఉండగా ఏరియల్ సర్వే చేయలేదా అని ప్రశ్నించారు. వరద బాధితుల దగ్గరకు వెళ్లిన చంద్రబాబు వారికేం చేశారు. వరద బాధితుల వద్దకు వెళ్లిన చంద్రబాబు.. తన బాధలు చెప్పుకున్నారు. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. గోదావరి పుష్కరాల్లో 29 మందిని పొట్టన బెట్టుకోవడం మానవ తప్పిదం. వాస్తవాలు బయటకు రాకుండా సీసీ ఫుటేజ్ డిలీట్ చేయించారని" ఎమ్మెల్యే రోజా దుయ్యబట్టారు.

# వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: చంద్రబాబు




నెల్లూరు: వరద బాధితులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు గురువారం నెల్లూరు జిల్లాకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రజలను గాలికొదిలేసిందని విమర్శించారు. మద్యపాన నిషేధమన్న జగన్‌రెడ్డి.. మద్యం తాగితేనే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. తనను, తన కుటుంబాన్ని ఎన్ని అవమానాలకు గురిచేసినా.. ప్రజల కోసం ఎల్లప్పుడూ ముందుంటానని, మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని చంద్రబాబు అన్నారు. కాగా నెల్లూరుకు చేరుకున్న చంద్రబాబుకు నాయుడుపేట గోమతి సెంటర్లో టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు పర్యటనలో టీడీపీ అభిమానులు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు.

# భార్యను రోడ్డుమీదకు తెచ్చిన ఘనత చంద్రబాబుదే: కొడాలి నాని



అమరావతి: వరద నష్టాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, ముమ్మరంగా సహాయ చర్యలు చేపడుతున్నామన్నారు. సీఎం ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారన్నారు. చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. భార్యను రోడ్డు మీదకు తెచ్చిన ఘనత చంద్రబాబుదే. ఆయన రాజకీయ వ్యభిచారిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. "రాజకీయ అవసరాల కోసం భార్యను రోడ్డు మీదకు తేవడం అన్యాయం. చంద్రబాబు మాదిరిగానే లోకేష్ వ్యవహరిస్తున్నారు. ఏదోలా రాజకీయ లబ్ధి పొందాలని చంద్రబాబు తాపత్రయం. చంద్రబాబు బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. అసెంబ్లీ వదిలేసి కుంటిసాకులతో బయటకెళ్లిపోయారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కలిసి భువనేశ్వరి పరువు దిగజార్చారు. వరదల్లో బాధితుల పరామర్శకు వెళ్లి.. నన్ను అవమానించారంటూ చంద్రబాబు ఏడుస్తున్నారని" మంత్రి కొడాలి నాని నిప్పులు చెరిగారు.

# సీఎం జగన్‌కు మంచి పేరు వస్తోందని టీడీపీ కుట్రలు: అసెంబ్లీలో మంత్రి కృష్ణదాస్



అమరావతి: ఇప్పటివరకు 29.18 లక్షల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అసెంబ్లీలో గురువారం ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 71,811 ఎకరాల భూ సేకరణ జరిగిందన్నారు. పేదలకు సొంతిల్లు ఉండాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అన్నారు. కుల,మతాలకు అతీతంగా అర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీ జరిగిందన్నారు. సంక్షేమ పథకాలకు టీడీపీ మోకాలడ్డుతోందన్నారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చారిత్రాత్మక పథకం. ఈ పథకానికి సహకరించకపోగా టీడీపీ అడ్డంకులు సృష్టిస్తోంది. రాజధాని ప్రాంతంలో దళితులకు ఇళ్ల పట్టాలు దక్కకుండా అడ్డుకుంటున్నారు. సీఎం జగన్‌కు మంచి పేరు వస్తోందని టీడీపీ కుట్రలు చేస్తోంది. కోర్టులు స్టేలు తెచ్చి ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకుంటున్నారని" మంత్రి కృష్ణదాస్ మండిపడ్డారు.

# ఆ జీఓల రద్దు కోసం పోరాడుతాం: లోకేష్



అమరావతి: ఎయిడెడ్ ఆస్తులపై కన్నేసి తెచ్చిన జీఓలు రద్దు చేసే వరకూ పోరాడుతామని టీడీపీ నాయకుడు నారా లోకేష్ స్పష్టం చేశారు. ఎయిడెడ్ విద్యా వ్యవస్థ పేద విద్యార్థుల పాలిట వరమన్నారు. ప్రభుత్వాలు విద్య కోసం ఎంత ఖర్చు చేసినా తక్కువేనన్నారు. శాసనసభ, మండలి, బయట కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాడుతున్నామని ఆయన పేర్కన్నారు.

# భారీ వర్షాలు! సోషల్ మీడియా వార్తలు నమ్మొద్దు

తిరుపతి: రానున్న అతి భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి రంగంలో ఎన్‌డీఆర్ఎస్, ఎస్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉంటాయని తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ వెంకట అప్పలనాయుడు తెలిపారు. రానున్న రోజుల్లో అల్పపీడనం కారణంగా భారీ నుండి అతి భారీ వర్షాలు పాడనున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదం బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. అదే విధంగా అత్యవసరం వచ్చినప్పుడు ఎదుర్కోవలసిన పరిస్థితులపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

# సంపాదకీయం

శుక్రవారం 26 నవంబరు 2021

## అభివృద్ధి పథంలో భారత ఆర్థిక వ్యవస్థ

మన దేశ ఆర్థిక వ్యవస్థ పై శుభ సంకేతాలు వస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంటే ఏప్రిల్ 2021 నుంచి మార్చి 2022 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు 9% చొప్పున వృద్ధి చెందుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని అంచనాల్లోనూ, ప్రభుత్వ అంచనాల్లోనూ ఈ విషయం చెబుతున్నారు. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం కరోనా నియంత్రణపై నిరంతరం దృష్టి పెట్టడం.. ప్రైవేట్ రంగంలోనూ..ప్రభుత్వ రంగాల్లోనూ ఖర్చులు జరుగుతుండడం అదేవిధంగా గృహ నిర్మాణంలో పెట్టుబడులు పెరగడం వంటి కారణాలు ఉన్నాయి. 2021-22లో దేశ జీడీపీ వృద్ధి 9.1%గా ఉండవచ్చని ప్రపంచ ప్రఖ్యాత బ్రోకరేజ్ హౌస్ గోల్డ్‌మేన్ తెలిపింది. వార్షిక ప్రాతిపదికన, ఇది 8%తో పోలిస్తే ఎక్కువగా ఉంటుంది. ఇది 2021లో 8% ఉండగా, 2020లో 7%కి తగ్గింది. జీడీపీ వృద్ధికి కారణం ప్రభుత్వం నిరంతరం ఖర్చు చేయడం.. ప్రైవేట్ కార్పొరేట్లు ఖర్చు చేయడం. అదే సమయంలో, గృహ పెట్టుబడి కూడా మెరుగుపడుతోందని గోల్డ్‌మేన్ చెబుతోంది. 2022లో జీడీపీ వృద్ధికి వినియోగం ప్రధాన కారకంగా ఉంటుందని గోల్డ్‌మేన్ చెప్పింది. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా తెరుచుకుంది. కరోనా పరిస్థితి అదుపులో ఉంది. రెపో రేటును పెంచడంపై రిజర్వ్ బ్యాంక్ ఇప్పుడు ఆలోచించవచ్చని పేర్కొంది. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు రేట్లు పెంచాలని యోచిస్తున్నాయి. 2022లో రెపో రేటులో 75 బేసిస్ పాయింట్లు (0.75%) పెరిగే అవకాశం ఉంది.రెండవ త్రైమాసికంలో భారతదేశ జీడీపీ 8.1% చొప్పున వృద్ధి చెందవచ్చని దేశంలోని అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) చీఫ్ ఎకనామిస్ట్ సౌమ్యకాంతి ఘోష్ అన్నారు. అయితే, మొత్తం సంవత్సరానికి అంటే ఏప్రిల్ 2021- మార్చి 2022 మధ్య వృద్ధి 9.3 నుండి 9.6% ఉండవచ్చు. ఈ కాలంలో వాస్తవ జీడీపీ రూ.2.4 లక్షల కోట్లు పెరిగి రూ.145.69 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. జనాభాలో ఎక్కువ భాగం టీకాలు వేయడమే దీనికి కారణంగా ఎస్బీఐ చెబుతోంది.రిజర్వ్ బ్యాంక్ కూడా పూర్తి సంవత్సరానికి జీడీపీ వృద్ధిని 9.5%గా అంచనా వేసింది. భారతదేశంలో కరోనా కేసులు చాలా తక్కువ. కరోనా బారిన పడిన టాప్ 15 దేశాల్లో భారత్‌లో అతి తక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదికలో పేర్కొంది. భారతదేశంలో కరోనా యాక్టివ్ కేసులు 1.24 లక్షలు. ఇది జూన్ 2020తో పోలిస్తే తక్కువ. నివేదిక ప్రకారం అమెరికా, చైనా వంటి దేశాల జీడీపీ భారత్ కంటే తక్కువగా ఉంది. ఈ దేశాల నుంచి ఇప్పటివరకు వచ్చిన జీడీపీ గణాంకాల్లో మూడో త్రైమాసికంలో అమెరికా వృద్ధి 4.9% మాత్రమే కాగా, చైనా వృద్ధి 4.9% గా ఉంది.రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రభుత్వం ఖర్చులను నిరంతరం పెంచడం వల్ల 2021-22లో వృద్ధి 7.9%గా ఉండవచ్చని పేర్కొంది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో 7.7% వృద్ధిని అంచనా వేసింది. పారిశ్రామిక- సేవల రంగం నుంచి ఆర్థిక కార్యకలాపాలకు మరింత సహాయం లభిస్తుందని ఈ ఏజెన్సీ తెలిపింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధిరేటు 8.3% చొప్పున పెరగవచ్చని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. ప్రభుత్వ పెట్టుబడులు, ప్రోత్సాహకాలు తయారీ రంగానికి ఊతమిస్తాయి. ఈ వృద్ధికి సేవల రంగం ముందుంటుందని తాజా నివేదిక చెబుతోంది. ప్రోత్సాహకం అంటే ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉత్పత్తికి సంబంధించిన ప్రోత్సాహకాలు. ఇందులో 11 రంగాలు ఈ ప్రయోజనం పొందుతాయి. ఇవన్నీ తయారీ రంగాలు.భారతదేశ జీడీపీ వృద్ధి రేటు 9.5%గా ఉండవచ్చని ప్రపంచ ప్రఖ్యాత బ్రోకరేజ్ హౌస్ యూబీఎస్ సెక్యూరిటీస్ తెలిపింది. అంతకుముందు ఇది 8.9%గా అంచనా వేశారు. అయితే, 2023 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.7%గా ఉండవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం తక్కువగా ఉన్న వడ్డీ రేట్లు పెరగడం ప్రారంభమవుతుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ తన పాలసీ రేట్లను 50 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని పేర్కొంది. జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ 20.1% చొప్పున వృద్ధి చెందింది.రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనా కూడా ఈ అంచనాల మాదిరిగానే ఉంది. ఆర్థిక సంవత్సరం 22లో 8.7% వృద్ధిని అంచనా వేసింది. అయితే, వచ్చే ఏడాది అంటే ఆర్థిక సంవత్సరం 23(ఈజ 2023)లో, ఈ వృద్ధి దాదాపు 10% ఉండవచ్చు. వచ్చే మూడేళ్లలో భారతదేశ సగటు వృద్ధిరేటు 7%గా ఉండవచ్చని మోర్గాన్ స్టాన్లీ తన నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి రేటు 10.5% ఉండవచ్చని భారత ప్రభుత్వం తన అంచనాలో పేర్కొంది.వచ్చే ఆర్థిక సంవత్సరంలో అంటే 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు వృద్ధి 7 నుండి 7.5% మధ్య ఉండవచ్చని ఆర్థిక సలహా మండలి తెలిపింది.

## వరద బాధితులను ఆదుకునేందుకు టాలీవుడ్ స్పందించదా?

హైదరాబాద్, నవంబర్ 25, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో వరద నష్టం భారీ స్థాయిలో సంభవించింది. భారీ వర్షాలు, వరదల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ప్రస్తుతం వరద కొంచెం తగ్గుముఖం పట్టడంతో అధికారులు వరద నష్టాన్ని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ రంగానికి మొత్తం 1,354 కోట్ల రూపాయల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. రహదారులు.... చిత్తూరు, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల్లో 1,42,862 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. రహదారులు, కల్వర్టులు పెద్ద సంఖ్యలో దెబ్బతిన్నాయి. రహదారులు, కల్వర్టులకు 1,756 కోట్ల మేరకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఈ మేరకు ప్రాథమిక నష్టం అంచనా వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది.ఆంధ్రప్రదేశ్ ను వరదలు ముంచెత్తాయి. ప్రాణ, ఆస్తినష్టం జరిగింది. ప్రభుత్వం సహాయ కార్యక్రమాలను ప్రారంభించింది. వేల కోట్లలో ఆస్తి నష్టం జరిగింది. లక్షలాది ఎకరాలు నీటమునిగాయి. పంటనష్టం వేల కోట్లలో ఉంది. పక్కా ఇల్లు కూడా ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని సహాయం కోసం కోరింది. ముఖ్యమంత్రి జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఏపీ నుంచే టాలివుడ్ కు... కానీ ఏపీలో తెలుగు సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉంది. తెలుగు సినిమాలకు వచ్చే ఆదాయం ఆంధ్రప్రదేశ్ నుంచే ఎక్కువగా వస్తుంది. ఈ నేపథ్యంలో టాలీవుడ్ నుంచి స్పందన కరువైందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. అయితే తాజాగా అల్లు అరవింద్ కుటుంబానికి చెందిన గీతా ఆర్ట్స్ వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. వరద బాధితులకు పది లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ముఖ్యమంత్రి సహాయనిధికి పది లక్షలు పంపుతున్నట్లు ప్రకటించింది. ఏపీని నమ్ముకుని వెండితెరను ఏలుతున్న హీరోలు, నిర్మాతలు ఏపీ వరద బాధితుల సాయానికి ముందుకు వస్తారా? లేదా? అన్న చర్చ జరుగుతోంది. టాలివుడ్ కు, ముఖ్యమంత్రి జగన్ కు మధ్య సంబంధాలు అంతంత మాత్రమే ఉండటంతో ఈ ఊహాగానాలు చెలరేగుతున్నాయి.

కర్నూలులో తీరని నష్టం

వర్షాలతో అన్నదాత నిండా మునిగిపోయాడు. చేతికాడికి వచ్చిన పంట నీటిపాలైంది. ఆరుకాలం కష్టించిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో పంట నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో దొర్నిపాడు, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, చాగలమర్రి, హోళగుంద, కోసిగి, బండిఆత్మకూరు, కౌతాళం, ఆదోని మండలాల్లో పంట నష్టం అధికంగా ఉంది. కళ్లాల్లో ఆరబెట్టిన పంట పూర్తిగా తడిసిపోయింది. నందికొట్కూరు మండలంలో మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ముందస్తుగా రబీలో శనగ పంటను సాగు చేయగా అది కూడా వర్షం ధాటికి దెబ్బతింది. జిల్లా వ్యాప్తంగా 2,07,514 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 1,04,113 మంది రైతులు నష్టపోయారు. 1,24,370 ఎకరాల్లో శనగ పంటకు నష్టం వాటిల్లింది. 62,628 మంది రైతులు నష్టపోయారు. జిల్లాలో నవంబర్‌లో సాధారణ వర్షపాతం 27.6 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకూ 92 మిల్లీమీటర్లు నమోదైంది,ఖరీఫ్ సాగుకు సంబంధించి 23,284 మంది రైతులకు చెందిన 48,590 ఎకరాల వరి నేలకొరిగింది. 8,844 రైతులకు చెందిన 16,103 ఎకరాల మినుములు, 8,560 మంది రైతులకు చెందిన 16,472 ఎకరాల్లో జొన్న పంటలు దెబ్బతిన్నాయి. 248 మంది రైతులు సాగు చేసిన 1008 ఎకరాల్లో కంది, 368 మంది రైతులకు చెందిన 714 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. 120 మంది రైతులకు చెందిన 150 ఎకరాల్లోని పత్తి, 61 మందికి చెందిన 103 ఎకరాల్లోని వేరుశనగ పంట దెబ్బతింది.

## నానికి బెజవాడ బాధ్యతలు



విజయవాడ, నవంబర్ 25, (న్యూస్ పల్స్)విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని జిల్లాలో పార్టీ పై ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని కేశినేని నాని చక్కగా ఉపయోగించుకుంటున్నారు. తాను లేకుంటే జిల్లాలో టీడీపీ లేదన్న సంకేతాలను ఇటు క్యాడర్ కు, అటు నేతలకు కేశినేని నాని పంపుతున్నట్లే ఉంది. కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీలో కేశినేని నాని ఇప్పుడు కీలకంగా మారారు. పార్టీ అధినేత చంద్రబాబు కూడా కేశినేనికి ప్రాధాన్యత ఇస్తుండటం కనపడుతుంది. మొన్నటి వరకూ కేశినేని నాని పార్టీలో అసంతృప్తి నేతగా ఉండేవారు. ముఖ్యంగా జిల్లా నేతలైన దేవినేని ఉమ, బుద్దా వెంకన్న, బొండా ఉమామహేశ్వరరావులను శత్రువులుగా చూసేవారు. అప్పట్లో తమ నివాసంలో ఉన్న పార్టీ అర్బన్ కార్యాలయాన్ని తీసివేయడంపై కూడా కేశినేని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక కార్పొరేషన్ ఎన్నికల సమయంలో జరిగిన సంగతి అందరికీ తెలిసిందే. కేశినేనిపై బొండా ఉమ, బుద్దా వెంకన్న తీవ్ర స్థాయిలో విరుచుకుపడటంతో కొంత కాలం పార్టీకి దూరంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని కేశినేని నాని చంద్రబాబుకు చెప్పి వచ్చారన్న ప్రచారం జరిగింది. అయితే చంద్రబాబు 36 గంటల దీక్ష శిబిరానికి హాజరయిన కేశినేని నానితో పార్టీ అధినేత ఏకాంతంగా మాట్లాడారు. అప్పడే చంద్రబాబు చెప్పిన మాటలకు కేశినేని నాని కన్విన్స్ అయ్యారంటున్నారు. చంద్రబాబు దీక్ష తర్వాత కేశినేని నాని తిరిగి పార్టీలో యాక్టివ్ అయ్యారని చెబుతున్నారు. అప్పటి నుంచి ఆయన తన పార్లమెంటు పరిధిలో పర్యటిస్తున్నారు. బెంజ్ సర్కిల్ లోని ఫ్లై ఓవర్ నుకూడా పరిశీలించారు. ఉమతో పడకపోయినా? తాజాగా కొండపల్లి మున్సిపల్ ఎన్నికలను కూడా కేశినేని నాని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దేవినేని ఉమను వ్యతిరేకించినా, ఆయన నియోజకవర్గ పరిధిలోనే ఎన్నిక జరుగుతున్నా తాను కీలకంగా మారి టీడీపీకి పదవి దక్కడంలో కేశినేని కీలక పాత్ర పోషించారు. దేవినేని ఉమ అని అక్కడ చూడలేదు. పార్టీ అని మాత్రమే ఆయన చూశారని కేశినేని సన్నిహితులు చెబుతున్నారు. మొత్తం మీద బెజవాడ తెలుగుదేశం పార్టీ పై కేశినేని నాని గ్రిప్ పెరిగిందనే చెప్పాలి.

## తెరపైకి ప్రాంతీయ మండళ్లు

గుంటూరు, నవంబర్ 25, (న్యూస్ పల్స్)మూడు రాజధానుల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో ప్రాంతీయ అభివద్ధి మండళ్ల ఏర్పాటుపై దృష్టి సారించింది. గత రెండున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తోన్నా, రాష్ట్రాభివృద్ధిని విస్మరించిందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తోన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశంపై దష్టి సారించినట్లు తెలిసింది. వెనుకబడిన ప్రాంతాల అభివద్ధితో పాటు ప్రాంతాల మధ్య అసమానతలు నివారించేందుకు ప్రాంతీయ అభివద్ధి మండళ్లు ఏర్పాటు తక్షణ కర్తవ్యంగా భావిస్తోంది. మూడు రాజధానుల ఏర్పాటు సమయంలోనే ప్రాంతీయ అభివద్ధి మండళ్ల ఏర్పాటు కూడా తెరపైకి వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రాంతాల వారీగా అభివద్ధి పనులు చేపట్టేందుకు మొత్తం నాలుగు ప్రాంతీయ అభివద్ధి మండళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. విశాఖపట్నం కేంద్రంగా ఉత్తరాంధ్ర, రాజమండ్రి కేంద్రంగా గోదావరి, కష్ణా జిల్లాలు, ఒంగోలు కేంద్రంగా దక్షిణ కోస్తా జిల్లాలు, కర్నూలు కేంద్రంగా రాయలసీమ ప్రాంతీయ అభివద్ధి మండలి ఏర్పాటుపై కసరత్తు జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మొత్తం అభివద్ధి పనులు ప్రాంతీయ అభివద్ధి మండళ్ల ఆధ్వర్యంలో జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ మండళ్లకు చైర్మన్/ చైర్‌పర్సన్‌గా ఆయా ప్రాంతాల్లోని సీనియర్ నాయకులను నియ మిస్తారని సమాచారం. ప్రాంతీయ అభివద్ధి మండలికి సభ్య కార్యదర్శిగా కలెక్టర్ హోదా కలిగిన ఐఎఎస్ అధికారిని నియమిస్తారు. ఈ అభివద్ధి మండలిలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉంటారు. ప్రాంతీయ మండలి సభ్యులు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో పర్యటిస్తారు. తమ పరిధిలోని జిల్లాల్లోని వనరులకు అనుగుణంగా పారిశ్రామికాభివద్ధికి ప్రణాళికలు రూపొందిస్తారు. పెట్టుబడుల సేకరణకు ప్రయత్నిస్తారు.

రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివద్ధి చేసేందుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వేగంగా పెంచేందుకు ప్రాంతీయ అభివద్ధి మండళ్లు కషి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. అమరావతిలో యథాతథస్థితిని కొనసాగిస్తూ 90 శాతం పూర్తి అయిన భవనాల్లోకి గుంటూరు, విజయవాడలో ఉన్న రాష్ట్ర కార్యాలయాలను తరలించి వీటిని ఉపయోగంలోకి తేవడం ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని ఉన్నతాధికారులు ఆలోచన చేస్తున్నారు. రూ.3 వేల కోట్ల బ్యాంక్ రుణంతో రాజధాని గ్రామాల్లో అభివద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## సైదాబి మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తునామ్

### ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యస్ యమ్ డి యూనుస్

నంద్యాల నంద్యాల పట్టణంలో గురువారం నాడు ఓ ప్రకటనలో ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యస్ యమ్ డి యూనుస్ మాట్లాడుతూ పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మల చెరువు టోల్ ప్లాజా వద్ద జరిగిన సంఘటన చాలా బాధాకరం అని ముస్లిం హక్కుల పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి. యూనుస్ తీవ్రంగా ఖండించారు. గుంటూరు (రూరల్) ఎస్పీ గారు తుమ్మల చెరువు టోల్ ప్లాజా వద్ద జరిగిన వీడియోలను మీరు చూసి ఉంటే,సైదాబి మీద శివారెడ్డి అనే వ్యక్తి వారి అనుచరులు చేసిన దాష్టికం మీద పోలీసులు నమోదు చేసిన ఐపీసీ 324 సమంజసమేనా? అని ప్రశ్నించారు .అయ్యా మైనారిటీ వ్యక్తి అయిన సైదాబి మీద జరిగిన దాడి అధికార పక్ష నేతల అహంకారానికి పరాకాష్ట కాదంటారా? ఈ విడియో చూసిన ఏ ఒక్కరికైనా చాలా సులువుగా అర్థం అవుతుంది ఇది ముమ్మాటికి బలహీన వర్గాల మీద అహంకారపు దాడి అని, దీనిని ముస్లిం హక్కుల పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి. యస్ యమ్ డి యూనుస్ తీవ్రంగా మండిపడ్డారు, అధికార పక్షానికి చేందిన శివారెడ్డి మరియు వారి అనుచరులపై ఐపీసీ 307 పెట్టి కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్ గులాబ్ టిడిపి మైనార్టీ నాయకుడు.డి. అక్బర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా షాపులో చోరీ

తిరుపతి తిరుపతి నగరంలోని ఒక కిరాణాలో దొంగతనం జరిగింది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దకాపు లేఅవుట్ లో ఘటన జరిగింది. షాపులోని నగదు టేబుల్ డ్రా లో ఉంచిన దాదాపు 150 000 నగదు అపహరణకు గురయ్యాయి.

షాప్ లోని నగదు చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజ్ నమోదు అయ్యాయి. దుకాణం యజమాని పిర్యాదు ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునిఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి ఎస్సై ప్రకాష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

## ఇక ప్రజా క్షేత్రంలోకి...

తిరుపతి, నవంబర్ 25, (న్యూస్ పల్స్)ఎవరికైనా ఓటమి గుణపాఠాలను నేర్పుతుంది. అవమానాలు అందలం ఎక్కించే దిశగానే అడుగులు పడతాయి. వరస ఓటములతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కొద్దిగా డీలా పడినా వెంటనే తేరుకుని జనంలోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఏడు పదుల వయసులోనూ ఆయన నేల మీద తిరుగుతున్నారు. అవమానాలను దిగమింగుకుని ప్రజా సమస్యలపై ఆయన దృష్టి పెడుతున్నారు. ఆయన చెప్పినట్లుగానే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి చంద్రబాబు సిద్ధమయినట్లే కన్పిస్తుంది.చంద్రబాబు నిన్న కడప, నేడు చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నిన్న గాక మొన్న కన్నీళ్లు పెట్టుకుని ఈ రాజకీయాలు వద్దు అని వెళ్లిపోయిన చంద్రబాబు మళ్లీ ఎలా వచ్చారని ప్రశ్నించవచ్చు. ఆయన చెప్పినట్లుగానే ప్రజాక్షేత్రంలోనే తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు అంత సులువుగా ఓటమిని అంగీకరించే నేత కాదు. కిందపడినా తనదే పై చేయి అని చెప్పుకునేటంతటి సమర్థత ఉన్న నేత. మరింత దూకుడుగా... అలాంటి చంద్రబాబు రానున్న కాలంలో మరింత దూకుడుగా వ్యవహరిస్తారంటున్నారు. మూడు ప్రాంతాల్లో చంద్రబాబు భారీ బహిరంగ సభకు ప్లాన్ చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. మూడు రాజధానుల అంశాన్ని జగన్ ప్రభుత్వం వెనక్కు తీసుకున్న నేపథ్యంలో మరింత స్పీడ్ పెంచాలనుకుంటున్నారు. ఈ రెండున్నరేళ్లు ఏ ప్రాంతంలో అభివృద్ధి చేయకుండా జగన్ ప్రభుత్వం చేసిన నిర్వాకాన్ని చంద్రబాబు ప్రజల ముందు ఎండగట్టనున్నారు.విశాఖ, అనంతపురం, తిరుపతి, విజయవాడల్లో సభలను ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. వరద పరిస్థితులు తగ్గుముఖం పట్టిన తర్వాత వచ్చే నెలలో మూడు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభల్లో జగన్ ప్రజాసమస్యలను ఏవిధంగా పక్క దారి పట్టిస్తారో చెప్పనున్నారు. బహిరంగ సభల ద్వారా తనను అసెంబ్లీలో ఏ విధంగా అవమానించిందీ కూడా చంద్రబాబు చెప్పనున్నారు. మొత్తం మీద చంద్రబాబు తొలుత సభల ద్వారా జనం ముందుకు వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.

## నాన్చుడే..కొంప ముంచుతోందా

విజయవాడ, నవంబర్ 25, (న్యూస్ పల్స్)చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా నానుస్తారు. అందుకే అనేక సార్లు ఆయన నష్టపోయారు. రాజకీయంగానే కాదు వ్యక్తిగతంగానూ నిర్ణయాల్లో జాప్యం కారణంగా ఇబ్బందిపడ్డారు. వల్లభనేని వంశీ విషయంలో చంద్రబాబు తప్పు చేస్తున్నారన్న కామెంట్స్ పార్టీ నుంచి వినపడుతున్నాయి. ఆయనను తొలుతే పార్టీ నుంచి బహిష్కరించి ఉంటే బాగుండేదంటున్నారు. వంశీని పార్టీ నుంచి బహిష్కరించకుండా చంద్రబాబు ఏం సాధించారన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. వల్లభనేని వంశీ తెలుగుదేశం పార్టీలోనే రాజకీయంగా ఎదిగారు. అందులో ఏమాత్రం సందేహం లేదు. అయితే ఆయన మొన్న ఎన్నికల్లో పార్టీ అధికారంలో రాకపోవడంతో వైసీపీకి మద్దతుదారుగా మారిపోయారు. పార్టీ మారినప్పుడే చంద్రబాబును ఘాటుగా విమర్శించారు. వ్యక్తిగత దూషణలకు కూడా దిగారు. కానీ చంద్రబాబు మాత్రం షోకాజ్ నోటీసు ఇచ్చి వదిలేశారు. పార్టీ నుంచి బహిష్కరిస్తే వల్లభనేని వంశీ నేరుగా వైసీపీలో చేరిపోతారని చంద్రబాబు ఆ నిర్ణయం తీసుకోక పోయి ఉండవచ్చు. కానీ వల్లభనేని వంశీ కారణంగా పార్టీ, వ్యక్తిగతంగా చంద్రబాబు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారన్నది చూడాల్సి ఉంది. వల్లభనేని వంశీ ఇప్పటికీ సాంకేతికంగా టీడీపీ సభ్యుడిగానే కొనసాగుతున్నారు. వంశీ పార్టీకి చేసిన రాజీనామాను కూడా చంద్రబాబు ఆమోదించలేదు. దీంతో ఆయన అన్ని రకాలుగా టీడీపీ నేతగానే ఉన్నారు. అదే ఇప్పుడు ఇబ్బందిగా మారింది. వైసీపీ కూడా చంద్రబాబు కుటుంబ సభ్యులను దూషించింది తాము కాదని వారి పార్టీ నేతలేనని చెబుతున్నారు. కొత్తగా కలిగే నష్టమేంటి? వల్లభనేని వంశీ వల్ల కొత్తగా జరిగే నష్టం లేదు. భవిష్యత్ లో ప్రయోజనం లేదు. పైగా అది అలుసుగా చేసుకుని చంద్రబాబు కుటుంబ సభ్యులను వంశీ తూలనాడారంటున్నారు. అందుకే వంశీని బహిష్కరించాలంటూ పార్టీ నుంచే వాదనలు విన్పిస్తున్నాయి. అప్పుడే పార్టీకి గౌరవం ఉంటుందని, గన్నవరం నియోజకవర్గంలోనూ పార్టీ బలోపేతానికి అవకాశం ఉంటుందని పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. మరి వల్లభనేని వంశీ విషయంలో చంద్రబాబు ఇప్పటికైనా నిర్ణయం తీసుకుంటారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

## నిరాశలో రామసుబ్బారెడ్డి

కడప, నవంబర్ 25, (న్యూస్ పల్స్)జమ్మలమడుగు నేత రామసుబ్బారెడ్డికి ఈసారి కూడా ఎమ్మెల్సీ పదవి దక్కలేదు. 14 ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయినా అందులో రామసుబ్బారెడ్డి పేరు కన్పించలేదు. జమ్మలమడుగులో కీలక నేతగా ఉన్న రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని జగన్ హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. వచ్చే ఎన్నికల్లో జమ్మలమడుగు టిక్కెట్ సుధీర్ రెడ్డికే ఇచ్చి రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలన్నది జగన్ నిర్ణయం. ఈ మేరకు ఇద్దరి మధ్య రాజీ కుదిరిందన్న వార్తలు వచ్చాయి. కడప జిల్లా నుంచి... కానీ ఈసారి కడప జిల్లా నుంచి బద్వేలు చిన గోవిందరెడ్డికి ఎమ్మెల్సీ పదవి లభించింది. ఇప్పటికే కడప కోటాలో సి. రామచంద్రయ్య, చిన గోవిందరెడ్డి, రమేష్ యాదవ్ లను ఎమ్మెల్సీలుగా జగన్ ఎంపిక చేశారు. రానున్న కాలంలో ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అయినా అవి కడప జిల్లాకు దక్కుతాయా? లేదా? అన్నది డౌటే. ఎందుకంటే ఇప్పటికే ఈ జిల్లాకు ఎక్కువ పదవులు దక్కాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి. రానున్న కాలంలో... దీంతో రామసుబ్బారెడ్డికి రానున్న కాలంలో ఎమ్మెల్సీ పదవి లభిస్తుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. రామసుబ్బారెడ్డి 2014 ఎన్నికల్ల జమ్మలమడుగు నుంచి ఓటమి పాలయినా చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఆయన పదవీ కాలం పూర్తికాకముందే జమ్మలమడుగు టిక్కెట్ కావాలని అనడంతో ఆయనను ఆ పదవికి రాజీనామా చేయించారు. టీడీపీలో రామసుబ్బారెడ్డికి దక్కిన గౌరవం వైసీపీలో లేదన్నది ఆయన అనుచరుల నుంచి విన్పిస్తున్న టాక్

## యువతి ఆత్మహత్యాయత్నం

శ్రీశైలం శ్రీశైలంలోని ప్రధాన ఆలయానికి సమీపంలో ఒక యువతి పాయిజన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషంతాగి పడిపోయిన యువతిని చూసిన భక్తులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధిత మహిళకు ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేసిన మౌనిక (25) హైదరాబాద్ కు మహిళగా గుర్తించారు. కుటుంబ కలహాలతోనే పురుగుల మందు వెంట తీసుకొని వచ్చి శ్రీశైలంలో ఆత్మహత్యాయత్నం పాల్పడినట్లు సమాచారం. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.

# విశాఖకు నీటికి కటకటే...



విశాఖపట్టణం, నవంబర్ 25, (న్యూస్ పల్స్)రానున్న వేసవికాలంలో నగర ప్రజలకు తాగునీటి కష్టాలు తలెత్తకుండా పటిష్ట ప్రణాళికలు ముందుగానే రూపొందించాం. తాగునీరు అందుబాటులో ఉండీ.. సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించాం. ...ఇవి అధికారుల మాటలు...అంతర్జాతీయ నగరంగా, ఆర్థిక రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతామంటూ గొప్పలు చెబుతున్న పాలకులు.. నగరానికి కావాల్సిన నీటి వనరులను పెంపొందించడంలో పూర్తిగా విఫలమయ్యారు. పాతికేళ్లుగా అదనపు నీటి వనరులు సమకూర్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా కనిపిస్తోంది. ఫలితంగా పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా చేసేందుకు కార్పొరేషన్ అధికారులు తలకిందులవుతున్నారు. 8 లక్షల జనాభా ఉన్నప్పుడు ఉన్న వనరులతోనే సుమారు 40 లక్షల జనాభా ఉన్న నేటి నగరానికి నీటిని సరఫరా చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కురవాల్సిన దానికంటే కనిష్ట స్థాయిలో వర్షాలు కురవడంతో ఆయా వనరుల్లో నీటి నిల్వలు పెరగలేదు. ఫలితంగా వేసవి రాకముందే అవన్నీ ఎండిపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఏలేరు, రైవాడ, మేఘాద్రిగెడ్డ, తాటిపూడి, గంభీరం కాల్వల ద్వారా నగరానికి తాగునీటి అవసరాలకు 80 ఎంజీడీలు అవసరం ఉండగా.. నీటి వనరుల లభ్యత బట్టి కేవలం 67.3 ఎంజీడీల నీరు సరఫరా అవుతోంది. శివారు ప్రాంతాలైన ఆరిలోవ, విశాలాక్షినగర్,

### మార్చి 1 నుంచి రోజు విడిచి రోజే మంచినీరు

తోటగరువు, ముడసర్లోవ, చినగదిలి తదితర ప్రాంతాలకు నీటిని అందించే ముడసర్లోవ రిజర్వాయర్ నీటిమట్టం కనిష్ట స్థాయికి సమీపిస్తోంది. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ నుంచి రోజుకి 0.5 ఎంజీడీ నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ గరిష్ట నీట మట్టం 169 అడుగులు కాగా.. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా 157 అడుగులకు పడిపోయింది. ఈ నీటి వనరులు ఏప్రిల్ నెలాఖరు వరకు సరిపోతాయి. ఆ తర్వాత శివారు గ్రామాల పరిస్థితి ఏమిటన్నది అంతు చిక్కడంలేదు. ఒక్క ఏలేశ్వరంలో తప్ప.. మిగిలిన రిజర్వాయర్లన్నీ అథమ స్థితికి చేరుకున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఒక్క ముడసర్లోవే కాకుండా మిగిలిన కెనాల్స్ పరిస్థితీ అదే మాదిరిగా ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత ప్రకారం ఏప్రిల్ నెలాఖరు వరకు నెట్టుకొచ్చేయ్యొచ్చు. ఆ తర్వాత పరిస్థితేంటన్నది అగమ్యగోచరంగా మారనుంది. వీటిలో ఒక్క ఏలేరు కాల్వ నుంచే 80 ఎంజీడీల నీరు నగరానికి సరఫరా అవుతోంది. అయితే.. మార్గమధ్యంలో రైతుల దారిమళ్లింపు, లీకుల వల్ల దాదాపు 20 ఎంజీడీల నీరు వృథా అయిపోతుండగా.. కేవలం 65 ఎంజీడీలు మాత్రమే అందుతున్నాయి. ఇందులో 35 ఎంజీడీలు స్టీల్ ప్లాంట్‌కు, 10 ఎంజీడీలు ఏపీఐఐసీ, గంగవరం పోర్టు, ఎన్‌టీపీసీ వంటి పరిశ్రమలకు అందిస్తున్నారు. మిగిలిన 20 ఎంజీడీలు నగర ప్రజల తాగునీటి కోసం వినియోగిస్తున్నారు. దీంతోపాటు రైవాడ నుంచి 25 ఎంజీడీలు, మేఘాద్రిగడ్డ నుంచి 8.5, గోస్తనీ నుంచి 3.5, తాటిపూడి నుంచి 11 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తోంది. అయితే.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను చూస్తుంటే.. త్వరలోనే ఈ సరఫరా పూర్తిగా తగ్గిపోయే ప్రమాద సూచికలు కనిపిస్తున్నాయి.ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా ఏలేరులో 85.97 మీటర్ల గరిష్ట నీటిమట్టం ఉంది. రోజుకు 80 ఎంజీడీల చొప్పున సరఫరా చేస్తే.. 2019 డిసెంబర్ వరకూ ఈ నీటి నిల్వలు సరిపోతాయి.

ఈలోపు వర్షాలు కురిస్తే తప్ప.. ఇందులో నుంచి సరఫరా మహా కష్టమనే చెప్పవచ్చు. మిగిలిన రిజర్వాయర్ల పరిస్థితీ దారుణంగా మారింది. ఎగువ ప్రాంతాల్లో సరైన వర్షాలు కురవకపోవడంతో.. నీటి నిల్వలు ప్రమాదకరంగా పడిపోతున్నాయి. ఏలేరు తర్వాత ఎక్కువ శాతం నీటిని సరఫరా చేసే రైవాడ కూడా కనిష్టమట్టానికి చేరువై ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రైవాడ రిజర్వాయర్ కనిష్ట నీటిమట్టం 99 మీటర్లు కాగా.. ప్రస్తుతం 103.50కి చేరుకుంది. రోజు వారీ సరాసరి సరఫరా చేస్తే.. జనవరి మొదటి వారంలోనే రైవాడ ఖాళీ అయిపోతుందని మహా విశాఖ నగర పాలక సంస్థ నీటి సరఫరా విభాగం అంచనా వేస్తోంది. ఇలా.. ప్రతి రిజర్వాయర్.. అట్టడుగు స్థాయికి చేరుకొని వచ్చే ఏడాది జనవరి నాటికే నగరంలో దాహం కేకలు వినిపించనున్నాయి.వర్షాభావ పరిస్థితుల కారణంగా తగ్గిపోతున్న నీటినిల్వలపై ఆందోళన చెందిన జీవీఎంసీ అధికారులు.. ముందస్తు చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించారు. ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా బల్క్ కనెక్షన్లకు అందించే నీటి సరఫరాలో 25 శాతం కోత విధించాలని నిర్ణయించారు. తాటిపూడి నుంచి పరిశ్రమలకు అందించే నీటి సరఫరాలో డిసెంబర్ 1 నుంచి 2022 మే 20 వరకూ అంటే 171 రోజుల పాటు 25 శాతం చొప్పున తగ్గించి సరఫరా చేస్తే సుమారు 287 ఎంజీడీలు ఆదా చెయ్యవచ్చని భావిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అదే మాదిరిగా.. జోన్?1లో 2021 మార్చి 1 నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా చెయ్యాలని నిర్ణయించింది. 1, 2, 3, 6 వార్డులకు ఒకరోజు, మరుసటి రోజున 4, 5 వార్డులకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చెయ్యాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాంతాలకు గోస్తనీ నది నుంచి సరఫరా జరుగుతుంటుంది. ఒకవేళ ఈ సమయాల్లో గోస్తనీలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోతే.. టీఎస్ఆర్ రిజర్వాయర్ నుంచి ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు రివర్స్ పంపింగ్ చేసి ఆయా వార్డులకు నీటిని అందించాలని జీవీఎంసీ ప్రణాళికలు రూపొందించింది.

## గుంతల రహదారితో నరకయాతన

విజయవాడ కృష్ణాజిల్లా ముదినేపల్లి నుండి వయా సింగరాయపాలెం మీదుగా భీమవరం వెళ్లే రహదారి గుంతలు పడి వాహనదారులు ప్రయాణం చేసేందుకు నరకయాతన పడుతున్నారు. కొన్ని ఏళ్ల నుంచి అధికారులు పట్టించుకోకపోవటం కారణంగా ఈరోడ్డు నిర్లక్ష్యానికి గురి అవుతుంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలుసాగిస్తుంటాయి. సాధరణంగా తిరిగే ద్విచక్రవాహనాలు , స్కూల్, ఆర్టీసీ బస్సులు కాకుండా ముదినేపల్లి నుంచి భీమవరం ఎక్కువగా చేపలు చేరువులు , మేత తయారి కర్మాగారాలు వచ్చి పోయే వాహనాలు అధికంగా తిరగటంతో రోడ్డు పై ఒత్తిడి పడి రహదారి గుంతలు పడుతున్నాయిని స్థానికులు వాపోతున్నారు. రహదారి పై ప్రయాణం చేయాలంటే ఒళ్లుంతా హునం అయై పోతుందని నడుం నొప్పి , కండరాలు నొప్పి వెన్నుపూస ఇబ్బందులు తలెత్తున్నాయని జనం వాపోతున్నారు.

## పెళ్ళి కూతురు కి బీరువా, మంచం కానుక ఇచ్చిన ఆకర్ష్ రెడ్డి

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి పట్టణం దర్గామిట్టలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన పెళ్లి కూతురు కి బియ్యపు ఆకర్ష్ రెడ్డి బీరువా, డబల్ కాట్ మంచంను కానుకగా ఇచ్చారు. పెళ్లి కూతురు తల్లి మాట్లాడుతూ, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పేదలకు మీ తండ్రి ఎమ్మెల్యే బియ్యపు మదుసుదన్ రెడ్డి ఎంతో సహాయం చేస్తున్నారని, మా కుటుంబ సభ్యులు ఎల్లవేళలా రుణపడి ఉంటామని అన్నారు. మీ కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్ననని ఆమె తేలిపారు.

## అయ్యన్నపై పోలీసుల ఫిర్యాదు



విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుపై పోలీస్ అధికారుల సంఘం తీవ్రంగా స్పందించింది. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రుడు ని అరెస్టు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ స్వర్ణలత తెలిపారు.విశాఖ జిల్లా ఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు చేస్తున్న వ్యాఖ్యలు పోలీసుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. తక్షణం బహిరంగంగా పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం పోలీసుల ను అవమానించడం సరికాదని అన్నారు. పోలీస్ వ్యవస్థ ఏ రాజకీయ పార్టీకి చెందినది కాదని, అనుక్షణం ప్రజల కోసమే పని చేస్తుందని గుర్తుచేశారు. అయ్యన్నపాత్రుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పోలీసుల సేవలను ప్రజలు హర్షిస్తున్నారు అని తెలియజేశారు.

### పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కిన చిన్నారులు

కర్నూలు కర్నూల్ జిల్లా ఆదోని డివిజన్ పరిధిలో పెద్ద కడుబూరు పోలీస్ స్టేషన్ లో ఆరు సంవత్సరాల బాలుడు ఫిర్యాదు చేసాడు. స్కూల్లో పెన్సిల్ , రబ్బర్, కొంచెం 2రూపాయలు 5 రూపాయలు పోతున్నాయి అంటూ హనుమంతు (6) ఫిర్యాదు చేసాడు. పంచాయతీ చేసిన పెద్దకడబూరు పోలీసులు చిట్టి పొట్టి పిల్లల పంచాయతీ పరిష్కరించి ఇంటికి పంపిచారు. చిన్నారుల పంచాయతీ సోషల్ మీడియాలో ముద్దు ముద్దు మాటలు తో వైరల్ అవుతుంది

## పాపం... పిల్లి, మోపిదేవి

విజయవాడ, నవంబర్ 25, (న్యూస్ పల్స్)జగన్ గత ఏడాది శాసనమండలిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో శాసనమండలి సభ్యులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్ లు ఎమ్మెల్సీలుగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయినప్పటికీ వారిని ఎమ్మెల్సీలుగా చేసిన జగన్ తన మంత్రివర్గంలోకి కూడా తీసుకున్నారు. ఇద్దరికీ కీలక శాఖలను జగన్ అప్పగించారు. అంతా సవ్యంగా జరుగుతున్న దశలో మూడు రాజధానుల బిల్లు శాసనమండలికి వచ్చింది. శాసనమండలిలో మూడు రాజధానులు బిల్లు, సీఆర్డీఏ రద్దు బిల్లులు వీగిపోవడంతో పెద్దల సభపై జగన్ ఆగ్రహం చెందారు. వెంటనే శాసనమండలిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మంత్రులుగా ఉన్న పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణలను కేబినెట్ నుంచి తప్పించారు. అయితే వారికి జగన్ అన్యాయం చేయకుండా వెంటనే రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించారు. ఇద్దరూ పార్టీని తొలి నుంచి నమ్ముకున్న వారే. జగన్ కు అత్యంత విశ్వాస పాత్రులు. అయితే ఈరోజు శాసనమండలి రద్దు బిల్లును జగన్ ప్రభుత్వం తిరిగి వెనక్కు తీసుకుంది. అంటే శాసనమండలిని కొనసాగించడానికే జగన్ నిర్ణయించుకున్నారు. కానీ తనకు నమ్మకంగా ఉన్న ఇద్దరు మంత్రులు మాత్రం పదవిని కోల్పోయారు. వారి స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన వారిని మంత్రి వర్గంలోకి తీసుకున్నప్పటికీ పిల్లి, మోపిదేవిలకు అన్యాయం జరిగినట్లేనన్న చర్చ పార్టీలో జరుగుతుంది. వారికి జగన్ ఏం సమాధానం చెబుతారన్నది ఆసక్తికరం. వారు ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్నప్పటికీ మంత్రి పదవిని ఒక్క నిర్ణయంతో కోల్పోయినట్లయింది. ఆ నిర్ణయానికి కూడా జగన్ కట్టుబడి ఉండలేదు.

## అనంతపురం జిల్లాలో టీడీపీ నేతలు ఇంటి వద్ద ఉద్రిక్తత

అనంతపురం అనంతపురం జిల్లాలో తెలుగు దేశం పార్టీ నేతల ఇళ్ల దగ్గర ఉద్రిక్తత నెలకొంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేశారు అన్న నేపథ్యంలో ఇప్పటికే అనేక మంది మహిళ నాయకులు పైన కేసులు నమోదు అయ్యాయి. వైసీపీ పార్టీ నేతలు టీడీపీ వారిమీద కేసులు పెట్టడంతో పోలీసులు రంగప్రవేశం చేసారు. టిడిపి రాష్ట్ర మహిళా నాయకురాలు స్వప్న ఇంటిని పోలీసులు చుట్టుముట్టి సోదాలు నిర్వహించారు. దాంతో స్వప్న దంపతులు రోడ్డు పైకి వచ్చి ఆందోళనకు దిగారు. ఇప్పటికే కళ్యాణదుర్గం టీడీపీ మహిళ నేత వాల్మీకి ప్రియాంక పై కుడా అనేక కేసులు నమోదు అయ్యాయి.

## విశాఖ, ఎండడా జాతీయ రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం

### 3టౌన్ సీఐ మృతి? కానిస్టేబుల్ పరిస్థితి విషమం

విశాఖపట్నం విశాఖ నగరంలోని ఎండడా జాతీయ రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ప్రమాదంలో 3టౌన్ సీఐ ఈశ్వరరావు మృతి చెందారు. డ్రైవర్ సంతోష్ పరిస్థితి విషమంగా ఉంది. అతనికి మెరుగైన వైద్యం కోసం గీతం హాస్పిటల్ కు తరలించారు. నైట్ రౌండ్స్ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఎండాడ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో సీఐకు తలకు బలంగా తగలండంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఘటన స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఆదినారాయణ రావు, దిశా ఏసీపీ ప్రేమ్ కాజల్ సీఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్?కు తరలించారు.ఘటన వివరాలు తెలియగానే విశాఖ నగర కమిషనర్ మానీష్ కుమార్ సిన్హా అక్కడకు చేరుకున్నారు. సీఐ ఈశ్వర రావు మృతి పట్లగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఎండాడ కూడలి వద్ద తెల్లవారి జామున సుమారు 3:30 సమయంలో రోడ్డు ప్రమాదం జరిగిందని, ఇలా జరగడం చాలా బాధాకరం అని, ఇంకా రెండు సంవత్సరాలలో సీఐ ఈశ్వరరావు కు రిటైర్మెంట్ ఉండగా.. ఈలోగా ఇలా జరగడం కుటుంబసభ్యులను తీవ్రగ్ర్భాంతి కి లోనైయ్యేలా చేసిందని అన్నారు

## భారీ వర్షాలను ఎదుర్కొనడానికి పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

తిరుపతి రానున్న రోజుల్లో అల్పపీడనం కారణంగా భారీ నుండి అతి భారీ వర్షాలు పాడనున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం నిమిత్తం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఫ్ బృందాలను అప్రమత్తంచేసి అత్యవసరం వచ్చినప్పుడు ఎదుర్కోవలసిన పరిస్థితులపై సూచనలు, సలహాలను అర్బన్ జిల్లా యస్.పి వెంకట అప్పల నాయుడు, చేసారు. ఈ నెల 26 నుంచి డిసెంబర్ 2 వరకు అతి భారీగా వర్షాలు పడనున్నాయని అని సమాచారం. భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరం అయితేనే ప్రజలు గానీ, వాహనదారులుగానీ బయటకు రావాలి. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ పోల్స్, చెట్ల కింద నిలబడరాదు. పాత భవనాల కింద, చెట్ల కింద, విధ్యుత్ స్థంబాలు ఉన్న ప్రాంతాలలో ప్రజలు ఉండరాదు. ఈ సమయంలో ప్రస్తుతం నిండిన చెరువులు పొంగే అవకాశం ఉంది. నదులు, కాలువలు వరద నీటితో ఉధృతంగా ప్రవహించ వచ్చు. పలు ప్రాంతాలు వరద ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. సోషల్ మీడియాలలో భయాందోళనలు కలిగించకండి. అపోహాలను నమ్మొద్దు. ఏ విషయమైనా నిర్ధారణ చేసుకోండి. సోషల్ మీడియా, వాట్సప్ లలో కొన్ని వార్తలను అతిగా నమ్మకండి. మెసేజులు వచ్చిన వెంటనే ఇతరులకు పంపకండి, ఒక్కసారి నిజమెంతో తెలుసుకోండి.ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్త పడాలి, అలసత్వం పనికిరాదు.అనుక్షణం మీ రక్షణ కొరకే మేమున్నామని అయన అన్నారు.

## పదవి చేపట్టిన కొద్ది గంటల్లోనే రాజీనామా చేసిన స్వీడన్ మహిళా ప్రధాని



డెన్మార్క్ : స్వీడన్ తొలి మహిళా ప్రధాన మంత్రిగా రికార్డు సృష్టించిన మగ్దలీనా ఆండర్సన్ ఆ పదవిని చేపట్టిన కాసేపటికే రాజీనామా చేశారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఆమోదం లభించకపోవడంతోపాటు, ఆమె నేతృత్వం వహిస్తున్న కూటమి నుంచి గ్రీన్స్ పార్టీ వైదొలగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతకుముందు ఆమె రెండు పార్టీలతో కలిసి మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు పార్లమెంటులో తిరస్కరణకు గురి కాగా, ప్రతిపక్షం ప్రతిపాదించిన బడ్జెట్‌కు అనుకూలంగా 154 ఓట్లు, ప్రతికూలంగా 143 ఓట్లు లభించాయి. దీంతో ఆండర్సన్ నేతృత్వంలోని సోషల్ డెమొక్రాటిక్ పార్టీ కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం నుంచి వైదొలగడమే మంచిదని నిర్ణయించుకుంది. దీంతో ఆమె ప్రధాన మంత్రి పదవికి బుధవారం రాజీనామా సమర్పించారు. ఆ పదవిలో ఆమె సుమారు 7 గంటలపాటు మాత్రమే ఉన్నారు. ఆండర్సన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇది గౌరవానికి సంబంధించిన విషయమని చెప్పారు. ప్రభుత్వ చట్టబద్ధతను, నియమబద్ధతను ప్రశ్నించే పరిస్థితిలో ప్రభుత్వాన్ని నడపటం తనకు ఇష్టం లేదన్నారు. ప్రభుత్వం నుంచి వైదొలగాలని సంకీర్ణ ప్రభుత్వంలోని ఓ పార్టీ నిర్ణయించుకుంటే, ఆ సంకీర్ణ ప్రభుత్వం తప్పనిసరిగా రాజీనామా చేయాలన్నారు. ఇదిలావుండగా, తాను సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ప్రభుత్వాన్ని నడిపేందుకు సిద్ధమేనని పార్లమెంటరీ స్పీకర్ ఆండ్రియాస్ నోర్లెన్‌కు ఆండర్సన్ తెలిపారు. దీంతో నోర్లెన్ స్పందిస్తూ, తాను ఎనిమిది పార్టీల నేతలతో సంప్రదిస్తానని చెప్పారు. దీనికి సంబంధించిన ఓ విధానాన్ని ఆయన గురువారం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించిన గ్రీన్ పార్టీ మరోసారి ప్రధాన మంత్రి పదవి కోసం జరిగే ఎన్నికలో ఆండర్సన్‌కు మద్దతిస్తామని ప్రకటించింది.

## రికార్డు సమయంలో ట్రాక్ పునరుద్ధరణ..

### నెల్లూరు-పడుగుపాడు లైన్ క్లియర్

నెల్లూరు నవంబర్ 25 భారీ వర్షాలతో నెల్లూరు- పడుగుపాడు సెక్షన్ల వద్ద కోతకు గురై తీవ్రంగా దెబ్బతిన్న, రైల్వే ట్రాక్‌ను అధికారులు రికార్డు సమయంలో పునరుద్ధరించారు. భారీ వర్షాలతో పడుగుపాడు-నెల్లూరు మెయిన్ లైన్ మధ్య 1.8 కి.మీ పొడవున ట్రాక్ దెబ్బతింది. దీంతో విజయవాడ- చెన్నై గ్రాండ్ ట్రంక్ మార్గంలో విజయవాడ-చెన్నై, చెన్నై-విజయవాడ 2 మెయిన్ లైన్‌లు తీవ్రంగా దెబ్బతిని రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిన విజయవాడ డివిజన్ అధికారులు కేవలం 40 గంటల్లోనే ట్రాక్ పునరుద్ధరణ పనులు విజయవంతంగా పూర్తి చేశారు. విజయవాడ డివిజినల్ మేనేజర్ శివేంద్ర మోహన్, అధికారుల బృందం ఖచ్చితమైన ప్రణాళిక, అందుబాటులో ఉన్న వనరుల సమీకరణతో పునరుద్ధరణ పనులు పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. 300 మంది కార్మికులు, 50 మంది సూపర్ వైజర్లు, 25 మంది అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు 2 షిఫ్టుల్లో అవిశ్రాంతంగా పనిచేసి, ట్రాక్ పూర్తిగా సాధారణ స్థితికి తీసుకొచ్చినట్టు అధికారులు వెల్లడించారు. రికార్డు సమయంలో ట్రాక్‌ను పునరుద్ధరించిన విజయవాడ డివిజన్ అధికారులను దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా అభినందించారు.

## వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

### కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ఎండి ఖుతుబొద్దిన్ పాషా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కు వినతి

కోరుట్ల నవంబర్ 25 వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి ,వెంటనే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మెట్ పెల్లి మాజీ పట్టణ అధ్యక్షులు ఎండి ఖుతుబొద్దిన్ పాషా ప్రభుత్వాన్ని కొరారు.టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు కోరుట్ల నియోజకవర్గ లోని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు ఆదేశాలు మేరకు బుధవారం మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు నిరసన తెలుపుతూ రైతులకు ,ప్రజలకు ఆదుకోవాలని మెట్ పెల్లి ఆర్డీవో కు వినతి అందజేశారు.ఈ సందర్భంగామాజీ పట్టణ అధ్యక్షుడు ఖుతుబొద్దిన్ పాషా మాట్లాడుతూ వానాకాలంలో లక్షల ఎకరాల్లో వరి సాగైందని ప్రభుత్వం దగ్గర అంచనాలున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అవసరమైన కనీస సదుపాయాలు కూడా ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడే టార్పాలిన్లు ,ధాన్యంలో తేమ శాతాన్ని కొలిచే శుభ్రం చేయు యంత్రాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్న పటించుకోవడం లేదని అన్నారు.మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అలాగే ప్రభుత్వం పెట్టిన ఓటీపీ విధానంతో ధాన్యం కొనుగోలు లో కాలయాపన జరుగుతుందని ,కావున ఓటీపీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని అన్నారు.మండలంలో హన్మాజీ పెట్ గ్రామంలో వరి ధాన్యం కుప్ప దగ్గర చనిపోయినా సింగం శంకర్ కుంటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని , .అర్హులందరికీ ఆసరా పెన్షన్లు ,డబుల్ బెడ్ రూమ్ లు పెండింగ్ లో ఉన్న హోసింగ్ బకాయలు ఇవ్వాలని మరియు వచ్చే యాసంగిలో అన్నదాతలు ఏ పంటలు వేయాలో ప్రభుత్వమే తెలపాలని అన్నారు.

## బ్రాహ్మణ కార్తీక వన భోజన ఆహ్వాన పత్రిక విడుదల

కర్నూలు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక వన భోజన ఆహ్వాన పత్రిక ను ఈ రోజు సంకల్ భాగ్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లే చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్ కె రాజశేఖర రావుబ్రాహ్మణ సంఘం ముఖ్య సలహదారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28 వ తేదీ పవిత్ర తుంగభద్ర నది తీరం లో కళ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో కార్తీక వన భోజనాలు కార్యక్రమం నిర్వహిస్తున్నామని కావున కర్నూలు నగరం లో వుండే బ్రాహ్మణ కుటుంబాలు అందరు ఈ వన భోజనం కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలి అని కోరినారు.ఉదయం 5 -30 గంటలకు శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామికి మరియు భవాని సహిత రామలింగేశ్వర స్వామి వారికి అభిషేకం, విశేష పూజలు మరియు 9 -30 నిమిషాలకు ధాత్రి పూజ, పిల్లకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యమాలు అనంతరం విశిష్ట అతిధులకు సన్మానం, పిల్లలకు బహుమతి ప్రదానం, అనంతరం భోజన కార్యక్రమం జరుగును. అని తెలిపారు. ఈ కార్యక్రమం లో బ్రాహ్మణ సంఘం సభ్యులుకె. జి. ప్రభాకర రావు , పద్మనాభ రావు, సుబ్రమణ్యం శాస్త్రి,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

### జవాద్ తుఫాన్ తో బోసి పోయిన శ్రీకాళహస్తిశ్వరాలయం

శ్రీకాళహస్తి నాడు కరోనా, నేడు జవాద్ తుఫాన్ కారణం గా శ్రీకాళహస్తిశ్వరాలయం లో భక్తులు లేక బోసిపోయింది. సాధరణం గా శని, ఆది, సోమ, మంగళ వారాలలో ఆలయం భక్తుల తో కిటకిట లాడుతుంది. కార్తీక మాసం లో నిత్యం రద్దీ తో కనిపించే శివాలయాలను గత వారం రోజులు గా జవాద్ తుఫాన్ అతలాకూతలం చేసింది.. శ్రీకాళహస్తిశ్వరాలయానికి భక్తులు రాక ప్రశ్నార్థకం గా మారింది. శ్రీకాళహస్తి ఆలయం కు భక్తులు తమిళ నాడు . కర్ణాటక .తెలంగాణ నుంచి ఎక్కువగా రాహుకేతు పూజలు నిర్వహించు కునేందుకు తండోపతండాలుగా వస్తుంటారు. చెన్నై నగరం లో విపరీతం గా వర్షాలు కురవడం తో అక్కడ ప్రజలు ఇంటి నుండి బయట కు రావడం లేదు. దాంతో నిత్యం రద్దీ గా ఉండే శ్రీకాళహస్తిశ్వరాయం భక్తులు లేక బోసి పోయింది

# విద్యార్థులకు సరైన సమయానికి బస్సులు నడపాలి

ఎమ్మిగనూరు నవంబర్ 25,( విభారె) ( పట్టణంలో పలు గ్రామాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థులకు సరైన సమయానికి బస్సులు నడపాలి ఏ ఐ ఎస్ ఏ టౌన్ కార్యదర్శి అర్జున్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు సరైన సమయానికి బస్సులు రాకపోవడం వలన విద్యార్థులకు కళాశాలకు, పాఠశాలకు లేట్ కావడం వలన విద్యాసంస్థల యాజమాన్యం రోజు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు అలాగే ఇప్పటికే విద్యార్థులకు చదువుకు చాలా దూరం అయ్యారు దీనిని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు విద్యార్థులకు చదువు వృధా కాకుండా సరైన సమయానికి విద్యార్థులు కళాశాలలకు వెళ్లి సరైన సమయానికి ఇంటికి వెళ్లే మార్గాన్ని ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేయాలని కోరారు ఆర్టీసీ డిపో మేనేజర్ కూడా సమస్యపై వెంటనే స్పందించి సరైన సమయానికి బస్సులు నడపాలని ఏ ఐ ఎస్ ఏ నాయకులు హెచ్చరించారు లేనియెడల అఖిల భారత విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ రాముడు ఈరన్న చిన్న తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రైతుల పాదయాత్రను అడ్డుకుంటాం

నంద్యాల నవంబర్ 25,( విభారె) నంద్యాల పట్టణంలో గురువారం నాడు రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లా లో శుక్రవారం నాడు జరుగుతున్న జేఏసీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది అని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును వెనక్కు తీసుకున్న సందర్భంగా రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నేతలు రామినేని రాజునాయుడు, బి.శ్రీరాములు, రామకృష్ణ, రామచంద్రుడు , ఓబులేసు వెంకట్ , రియాజ్ , నాగరాజు రమణలు మాట్లాడుతూ శ్రీ బాగ్ ఒప్పందం అమలు జరగకుండా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని వారు అన్నారు. రాయలసీమలో ఉన్న అన్ని పార్టీల నేతలు అమరావతి జపం చేస్తూ రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా శ్రీశైలం ప్రాజెక్టు కోసం కర్నూలు జిల్లా రైతులు 85 వేల ఎకరాలు భూమిని కోల్పోతే శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని అమరావతి మరియు కోస్తాంధ్ర ప్రాంత రైతులు వినియోగించుకుంటున్నారని అన్నారు. కానీ శ్రీశైలం ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన అనేక మంది రైతులకు నేటికీ ఉద్యోగ మరియు నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. అమరావతి రైతులు నష్ట పరిహారము ఉద్యోగాలు మరియు భూములు కావాలని

అడగకుండా అమరావతి రాజధాని కావాలని అడగడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. రాయలసీమ ప్రజలను అవమానిస్తూ అమరావతి రైతుల పాదయాత్ర కొనసాగుతుందని అమరావతి రైతులు ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని తక్షణమే వారి పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు . లేకుంటే మేమే అమరావతి ప్రాంత రైతులను రాయలసీమలో అడుగుపెడితే అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈనెల 26వ తేదీన కర్నూలులో జరిగే రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

# బీసీల అభివృద్ధి వైసీపీ తోనే సాధ్యం...

## వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ గుంతా దేవి

తుగ్గలి నవంబర్ 25,( విభారె) బీసీల అభివృద్ధి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అవుతుందని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుంతా దేవి మరియు విద్యా కమిటీ చైర్మన్ గుంతా రఘు తెలియజేశారు.గురువారం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి బీసీ జనగణన పై శాసనసభలో తీర్మానం చేసినందుకు జొన్నగిరి గ్రామంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుంతా దేవి మరియు విద్యా కమిటీ చైర్మన్ గుంతా రఘు లు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోనే బీసీల అభివృద్ధి జరుగుతుందని వారు తెలియజేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వారు తెలియజేశారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట వేస్తారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.బీసీ జనగణన పై శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టేందుకు జగన్మోహన్రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నాగప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు తెరప్ప,భాస్కర్ రెడ్డి,నెట్టికంటి,హనుమన్న, సుధా,లక్ష్మన్న ,మురళి,చిన్న అంజని,సుంకప్ప, రంగన్న,రంగయ్య,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధిత కుటుంబాలు భయాందోళన చెందవద్దు.....

## 405 వరద బాధిత కుటుంబాలకు సరుకులు, ఆర్థిక సాయం అందించిన రాజంపేట సబ్ కలెక్టర్

కడప నవంబర్ 25 రాజంపేట వరద ప్రభావిత గ్రామ ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, సహాయ పునరావాస చర్యలను ముమ్మరం చేస్తున్నామని.. రాజంపేట సబ్ కలెక్టర్ కేతన్ గార్గ్ బాధిత కుటుంబాలను ఓదార్చారు.పెనగలూరు మండలంలో చెరువు తెగిపోవడంతో.. ఎన్.ఆర్. పురం గ్రామ పంచాయతీ పరిధిలోని 5 గ్రామాలను వరద నీరు చుట్టుముట్టి రవాణా వ్యవస్థ, గ్రామాల మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ముంపు సమస్యలు రాజంపేట సబ్ కలెక్టరు కేతన్ గార్గ్ దృష్టికి రావడంతో.. స్పందించిన ఆయన తక్షణమే ఎన్.డి.ఆర్,ఎస్. సహాయక బృందాలతో కలసి ముంపు గ్రామాలను పరిశీలించారు. 405 ముంపు బాధిత కుటుంబాలకు అత్యవసర సాయంగా.. భోజనం, నిత్యావసర సరుకులు, ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం చెక్కులను అందజేయడం జరిగింది. తక్షణమే ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు.. చర్యలు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటోందన్నారు.

# అల్లం తింటే కలిగే ప్రమాదాలు ఏమిటో మీకు తెలుసా?

భారతీయ వంటకాలలో అల్లం ఒక అనివార్యమైన అంశం. అల్లం దాని రుచి మరియు వాసన కోసం మాత్రమే కాకుండా దాని ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా ఆహారంలో చేర్చబడుతుంది. ఇది ఘాటైన వాసన కలిగి ఉ ంటుంది మరియు ప్రపంచంలోని అనేక దేశాలలో ఉపయోగించబడుతుంది. అన్ని మాంసాహార వంటకాల్లో అల్లం ఖచ్చితంగా వాడటం జరుగుతుంది.ఆయుర్వేదంలో అల్లం ఔషధ గుణాల కోసం పురాతన కాలం నుండి ఉపయోగించబడుతోంది. అల్లం అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, ఇది కొన్ని తీవ్రమైన దుష్ప్రభావాలను కూడా కలిగిస్తుంది. అల్లం ఎక్కువగా తింటే చాలా ప్రమాదాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఈ పోస్ట్‌లో అల్లం మీకు ఎలాంటి ప్రమాదాలను కలిగిస్తుందో మీరు చూడవచ్చు.రక్తపోటుతో సమస్యలను కలిగిస్తుందిఅల్లంపై చాలా పరిశోధనలు రక్తపోటుపై దాని ప్రభావాలను పరిష్కరించలేదు. యాంటీహైపెర్టెన్సివ్ డ్రగ్స్ తీసుకునే వ్యక్తులు అల్లం ఎక్కువగా తినకూడదని సలహా ఇస్తారు. ఎందుకంటే ఇది రక్తపోటులో తీవ్రమైన తగ్గుదలని కలిగిస్తుంది. చేపలు తింటే గుండెకు మేలు చేయడంతోపాటు అనేక రుగ్మతలు నయమవుతాయి..అతిసారానికి కారణం కావచ్చుఅల్లం ఎక్కువ మోతాదులో తీసుకుంటే విరేచనాలు వస్తాయి. ఎందుకంటే ఇది ప్రేగుల ద్వారా ఆహారం మరియు మలం యొక్క ప్రకరణాన్ని వేగవంతం చేస్తుంది.చక్కెర ఎక్కువగా తింటే మధుమేహం వస్తుందా? మధుమేహం గురించిన వాస్తవాలు మరియు అపోహలుచక్కెర ఎక్కువగా తింటే మధుమేహం వస్తుందా? మధుమేహం గురించిన వాస్తవాలు మరియు అపోహలుగర్భధారణ సమయంలో సురక్షితం కాదుఅల్లం గర్భిణీ స్త్రీలలో వికారం తగ్గించగలిగినప్పటికీ, ప్రమాదకరమైన దుష్ప్రభావాలను గమనించడం ముఖ్యం. కొంతమంది నిపుణుల అభిప్రాయం ప్రకారం, అల్లం తీసుకోవడం వల్ల గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉంది. రోజుకు 1500 ఎంజ కంటే తక్కువ మోతాదు ఉంటే అది ప్రమాదకరం కాదు. మితంగా అల్లం సప్లిమెంట్స్ కూడా గర్భస్రావం మరియు ఇతర సమస్యలను కలిగిస్తాయి. గర్భధారణ సమయంలో అల్లం ఎక్కువగా



తీసుకోవడం వల్ల యాసిడ్ రిఫ్లక్స్ మరియు గుండెల్లో మంట వస్తుంది. ప్రసవ సమయంలో గణనీయమైన రక్తాన్ని కోల్పోయిన తల్లులు ప్రసవానంతర కాలంలో అల్లంను నివారించాలి.ఆతిజీఎవబివబ: బ్లడ్ షుగర్ తగ్గించే ఆయుర్వేద సింపుల్ మార్గాలు... ఇలా చేస్తే మధుమేహం భయం ఉ ండదు!ఆతిజీఎవబివబ: బ్లడ్ షుగర్ తగ్గించే ఆయుర్వేద సింపుల్ మార్గాలు... ఇలా చేస్తే మధుమేహం భయం ఉండదు!రక్తస్రావం కారణం కావచ్చురక్తస్రావం అయినప్పుడు అల్లం తింటే అది పెరుగుతుంది. ఇది అల్లంకి మాత్రమే కాకుండా, అది జోడించబడే ఆహారానికి కూడా వర్తిస్తుంది. అల్లంలోని యాంటీ ప్లేట్‌లెట్ (రక్తం పలుచబడటం) లక్షణాల వల్ల రక్తస్రావం జరుగుతుందని కొందరు పోషకాహార నిపుణులు నమ్ముతారు. లవంగాలు, వెల్లుల్లి, జిన్సెంగ్ మరియు రెడ్ క్లోవర్ వంటి ఇతర మూలికలతో తీసుకున్నప్పుడు, జిన్సెంగ్ అధిక రక్తస్రావం ప్రమాదాన్ని మరింత పెంచుతుంది.రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంఅల్లం సాధారణంగా మధుమేహం చికిత్సలో సహాయపడుతుంది. కానీ మధుమేహం కోసం మందులు తీసుకున్నప్పుడు అది ప్రతికూల ప్రభావాలను కలిగి ఉంటుంది. ఇది మందుల ప్రభావాలను పెంచుతుంది మరియు రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది .గుండె లోపాలుమీ హృదయ స్పందన రేటును పెంచడంలో అల్లం కీలక పాత్ర పోషిస్తుందని కనుగొనబడింది. రక్తపోటు మందులు తీసుకునే వ్యక్తులు రక్తపోటులో అసహ్యకరమైన తగ్గుదలని అనుభవించవచ్చు. ఇది గుండెచప్పుడు సమస్యలకు దారి తీస్తుంది. అల్లం యాంటీహైపెర్టెన్సివ్ ఏజెంట్‌గా కూడా ఉపయోగించవచ్చు. ఇది చివరికి గుండె ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుంది.గ్యాస్ మరియు వాపుఅల్లం టీ చిన్న చిన్న జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. . ఇది తరచుగా ఎగువ జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. తద్వారా అపానవాయువు కలుగుతుంది. జీర్ణక్రియకు అల్లం బదులుగా ఇతర పదార్థాలను ఉపయోగించడం ఉత్తమ పరిష్కారం. ఉబ్బరం ఉన్నప్పుడు అల్లం కలిపి శీతల పానీయాలు తాగడం వల్ల మంట వస్తుంది.గుండెల్లో మంటఅల్లం, ఎక్కువ మోతాదులో తీసుకుంటే (రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ), తేలికపాటి గుండెల్లో మంటను కలిగిస్తుంది. ఇందులో అతిసారం మరియు త్రేనుపు వంటి ఇతర దుష్ప్రభావాలు ఉన్నాయి. అల్లం మీద చేసిన అధ్యయనం గుండెల్లో మంటకు ప్రధాన కారణమని తేలింది.

అతిగా తీసుకుంటేనే ఈ సైడ్ ఎఫెక్ట్ వస్తుందని చెబుతున్నారు.మౌత్ ఇరిటేషన్‌దీనిని ఓరల్ అలర్జీ సిండ్రోమ్ అని కూడా అంటారు.

మీరు కొన్ని ఆహారాలు తిన్నప్పుడు కొన్ని అలర్జీలు వస్తాయి. ఈ అలెర్జీలు చెవి, చర్మం మరియు నోటిలో సంభవిస్తాయి మరియు మీరు అల్లం తీసుకున్నప్పుడు ఇదే విధమైన అలెర్జీ సంభవిస్తుంది, దీని వలన మీ నోటి దురద ప్రారంభమవుతుంది. నోటి చికాకు అసహ్యకరమైన రుచికి దారి తీస్తుంది. ఈ అలెర్జీలలో నోటిలో జలదరింపు మరియు వాపు ఉంటాయి.చర్మం మరియు కంటి చికాకు కలిగించవచ్చుఅల్లం వల్ల కలిగే సాధారణ ప్రతిచర్య చర్మం చికాకు మరియు దురద. అల్లం వల్ల కలిగే ఇతర అలర్జీలలో కళ్ళు దురద, చర్మం ఎర్రబడటం మరియు చర్మశోథ వంటివి ఉంటాయి. ఈ దుష్ప్రభావాలను నివారించడానికి సరైన మొత్తంలో అల్లం తీసుకోండి.

# 'అఖండ'మైన విజయం సాధిస్తే పెద్ద సినిమాలకు ఊపొచ్చినట్లే..!


కరోనా సెకండ్ వేవ్ పాండమిక్ తర్వాత ఇప్పుడిప్పుడే మెల్లగా ఇండస్ట్రీలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవల విడుదలైన 'లవ్ స్టోరీ' 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి చిత్రాలు తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఓవర్ సీస్ లోనూ మంచి వసూళ్ళు రాబట్టాయి.అయితే బాక్సాఫీస్ స్టామినా ఏంటో చూపించే పెద్ద సినిమా ఒక్కటి కూడా థియేటర్లలోకి రాలేదు. ఈ నేపథ్యంలో పాండమిక్ తర్వాత టాలీవుడ్ నుంచి ప్రేక్షకుల ముందుకొస్తున్న మొదటి భారీ చిత్రం 'అఖండ' అనే అనుకోవాలి.నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్ లో రూపొందుతున్న హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ "అఖండ". ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్న ఈ సినిమా రిలీజ్ కు రెడీ అయింది. భారీ అంచనాల మధ్య డిసెంబర్ 2న ప్రపంచ వ్యాప్తంగా విడుదల




కానుంది. ప్రీ రిలీజ్ థియేట్రికల్ డీల్స్ భారీ ధరలకు అమ్ముడవుతున్నాయి.ఈ నేపథ్యంలో బాలయ్య సినిమా థియేటర్లలో ఎలాంటి ప్రభావం చూపుతుందో అని ఇప్పుడు ఇండస్ట్రీ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.ఆంధ్రప్రదేశ్ లో టిక్కెట్ ధరలు మరియు మహమ్మారి భయంతో ఇంకా ఒక వర్గం ప్రేక్షకులు థియేటర్ల వైపు చూడకపోవడం వంటి అనేక సవాళ్లు ఉన్నాయి. అయితే కంటెంట్ బాగుంటే ఫ్యామిలీ ఆడియన్స్ సినిమాలను థియేటర్లలో చూసేందుకు సిద్ధంగా ఉన్నారని ఇటీవల కొన్ని చిత్రాలు రుజువు చేశాం ఖ.ఇప్పుడు 'అఖండ' సినిమా తో అన్ని వర్గాల ప్రేక్షకులు థియేటర్లకు పరుగులు తీస్తారని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.'అఖండ' సిని మా వీక్ డేస్ లో ఎలాంటి ప్రదర్శన ఇస్తుంది? కుటుంబ ప్రేక్షకులు ఏ మేరకు థియేటర్లకు వస్తారో చూడా లని టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ వేచి చూస్తున్నారు. బాలయ్య సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వసూళ్ళు రాబడు తోందో అని పెద్ద సినిమాలని తీసుకున్న డిస్ట్రిబ్యూటర్స్ ఎదురు చూస్తున్నారు.క్రిస్మస్ కు 'పుష్ప' - సంక్రాంతి సీజన్ లో 'ఆర్.ఆర్.ఆర్' 'రాధే శ్యామ్' 'భీమ్లా నాయక్' వంటి సినిమాలు విడుదలకు సిద్ధమయ్యాయి. ఇప్పుడు 'అఖండ' సినిమా మంచి కలెక్షన్స్ రాబడితే వాటన్నింటికీ నూతనోత్సాహం వస్తుందనడంలో సందేహం లేదు. మరి ఏమి జంగుతుందో చూడాలి.కాగా 'సింహా' 'లెజండ్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత బాలయ్య - బోయపాటి శ్రీను కాంబోలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ "అఖండ". ద్వారకా క్రియేషన్స్ బ్యానర్ పై మిర్యాల రవీందర్ రెడ్డి భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇందులో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండగా.. ప్రగ్యా జైస్వాల్ - జగపతిబాబు - శ్రీకాంత్ - పూర్ణ - సుబ్బరాజు కీలక పాత్రలు పోషించారు. ఎస్ఎస్ థమన్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు.

# ప్రభాస్ తర్వాతే ఎంత పెద్ద సూపర్ స్టార్ అయినా..!

ఒక హీరో స్టార్ డమ్ ను ఆయన తీసుకునే పారితోషికం మరియు ఆయన నటించిన సినిమాల వసూళ్లను ఆధారంగా లెక్కిస్తారు అనడంలో సందేహం లేదు. సక్సెస్ లు ఫ్లాప్ లు మరియు వసూళ్లు ఇవన్నీ పరిగణలోకి తీసుకుంటే ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ప్రభాస్ ను మించిన స్టార్ ఎవరు లేరు అంటూ అభిమానులు చాలా బలంగా చెబుతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఏడాదికి మూడు నాలుగు సినిమాల చొప్పున చేస్తున్నాడు. అయినా కూడా ఆయన్ను మించిన స్టార్ ప్రభాస్ అంటూ బాలీవుడ్ ఫిల్మ్ విశ్లేషకులు కూడా చెబుతున్నారు. ఎందుకంటే ప్రభాస్ ఒక్కో సినిమాకు వంద కోట్లకు పైగా పారితోషికంను అందుకుంటున్నాడు.ఇక రాధే శ్యామ్ మొదలుకుని స్పిరిట్ వరకు ఆయన చేస్తున్న ప్రతి సినిమా కూడా వందల కోట్ల బడ్జెట్ తోనే రూపొందుతున్న విషయం తెల్సిందే. అందుకే ఆయన స్టార్ డమ్ అలా అలా పెరిగి పోతుంది అంటూ అభిమానులు అంటున్నారు. రాధే శ్యామ్ సినిమా దాదాపుగా అయిదు వందల కోట్ల బిజినెస్ చేసినట్లుగా సమాచారం అందుతోంది. ఇక ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమా బడ్జెటే 500 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇక సలార్ సినిమా రేంజ్ కూడా మామూలు ఏం కాదు. ప్రాజెక్ట్ కే సినిమా కోసం నాగ్ అశ్విన్ ఏకంగా హాలీవుడ్ నే దించేస్తున్నాడు. ఆ సినిమా బడ్జెట్ కూడా అదే రేంజ్ లో ఉంటుందట. ఇక స్పిరిట్ సినిమాకు గాను ప్రభాస్ ఏకంగా 150 కోట్ల పారితోషికం అందుకుంటున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.స్పిరిట్ కు గాను ప్రభాస్ పారితోషికం 150 కోట్లు



అయితే మేకింగ్ కు అయ్యే ఖర్చు ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభాస్ ప్రతి సినిమా కూడా భారీ బడ్జెట్ తో రూపొందబోతుంది. వసూళ్లు కూడా ఖచ్చితంగా అదే స్థాయిలో ఉంటాయి కనుక ప్రభాస్ ఇండియన్ సిల్వర్ స్క్రీన్ కింగ్ అనడంలో సందేహం లేదు. బాలీవుడ్.. సౌత్ లో ఎంత పెద్ద స్టార్ అయినా ఇప్పుడు ప్రభాస్ తర్వాతే అంటూ అభిమానులు చెబుతున్నారు. ప్రభాస్ రాధే శ్యామ్ సినిమా కనీసం 250 కోట్లు వసూళ్లు చేస్తే ప్రభాస్ రేంజ్ మరింతగా పెరగడం ఖాయం అనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. 2025 వరకు ప్రభాస్ వందల కోట్ల సినిమాలు క్యూ కట్టి మరీ రాబోతున్నాయి. కనుక అప్పటి వరకు ప్రభాస్ ఇండియన్ బాక్సాఫీస్ బాద్ షా అంటున్నారు.

# రోజు వారి విటమిన్ ఇస్తున్న క్యూటీ

మాలీవుడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ టాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ అవుతుందని చాలా మంది భావించారు. కానీ ఆ అంచనాలన్ని తప్పు అయ్యాయి. అనూహ్యంగా అనుపమ కెరీర్ మలుపు తిరిగింది. 'ప్రేమమ్' తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ పెద్ద స్టార్ హీరోయిన్ కాలేకపోయింది. మీడియం రేంజ్ హీరోలకే పరిమితమైంది. ఆరకంగాను పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం అమ్మడి చేతిలో 'రౌడీ బోయ్స్'...'కార్తికేయ -2' చిత్రాలు మాత్రమే ఉ



న్నాయి. 'రౌడీబోయ్స్' త్వరలో రిలీజ్ కాబోతుంది. ఈ సినిమాపైనే అమ్మడు ఆశలు పెట్టుకుంది.ఆ సంగతి పక్కనబెడితే ఈ మల్లూ బ్యూటీ హెయిర్ స్టైల్ కి ఇటీవలే విజయ్ దేవరకొండ ఫిదా అయిన సంగతి తెలిసిందే. 'రౌడీబోయ్స్' లో అనుపమ రింగుల హెయిర్ స్టైల్లో స్పెషల్ అట్రాక్షన్ కానుంది. ఈ హెయిర్ స్టైల్ ని ఉద్దశిస్తూ విజయ్ సూపర్బ్ అనే కామెంట్ కూడా చేసారు. రౌడీబోయ్స్ కోసం అనుపమని కొత్త లుక్ లో లాంచ్ చేసినట్లు తెలుస్తోంది. హెయిర్ ట్రిమ్ చేసి రింగుల జుత్తు లోనే కొత్త లుక్ ట్రై చేసారు. ఈ లుక్ ఫ్రెష్ ఫీల్ ని తీసుకొచ్చింది. తాజాగా ఈ బ్యూటీ హెయిర్ మరోసారి హైలైట్ చేస్తూ కొత్త ఫోటో సెషన్లో పాల్గొంది. క్రాక్ టాప్ క్యామిసోల్ ర్యాప్ డ్రెస్ లో ఆకర్షణీయంగా కనిపిస్తోంది.మల్లూ బ్యూటీ అనుపమ మరో హాట్ కామెంట్ కూడా విసిరింది. 'ఇదిగో మీ రోజువారి విటమిన్ మీ' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. దీంతో ఆ ఫోటోతో పాటు కామెంట్ వైరల్ గా మారింది. సోషల్ మీడియాలో అనుపమ అభిమానులు కామెంట్లతో..ఎమోజీలతో ఎటాక్ చేసారు. ఏది ఏమైనా? రౌడీబోయ్స్ కి ఇదో రకమైన ప్రచారం అనాలేమో. ప్రస్తుతం ఈ సినిమాకి బజ్ తీసుకొచ్చే ప్రయత్నాలు సీరియస్ గానే సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాజుగారు అనుపమని ప్రచారం పరంగా ఇలా రంగంలోకి దించుతున్నారని తెలుస్తోంది.2021-22 సీజన్ అనుపమకు అన్నిరకాలా కలిసొస్తున్నట్టే అనిపిస్తోంది. ప్రస్తుతం నిఖిల్ సరసన జీఏ2 సంస్థ నిర్మిస్తున్న 18 పేజెస్ లో నటిస్తోంది. నిఖిల్ కార్తికేయ 2లోను నటిస్తోంది. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అలాగే తమిళంలో తల్లి పోగతే విడుదల కావాల్సి ఉంది.హెలెన్.. తలై నగరమ్ 2 అనే చిత్రాల్లోనూ నటిస్తోంది.

# నెరవేరిన అయ్యర్ కల.. దిగ్గజ క్రికెటర్ చేతుల మీదుగా క్యాప్.. వీడియో



టీమిండియా తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్న శ్రేయస్ అయ్యర్ కల ఎట్టకేలకు నెరవేరింది. న్యూజిలాండ్‌తో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం అతడు భారత్ తరఫున అంతర్జాతీయ టెస్టుల్లో అడుగుపెట్టాడు. కాన్పూర్ వేదికగా తొలి టెస్టు సందర్భంగా దిగ్గజ క్రికెటర్ సునిల్ గావస్కర్ చేతుల మీదుగా టీమిండియా క్యాప్(303) అందుకున్నాడు.కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ అజింక్య రహానే.. జట్టు సభ్యుల సమక్షంలో క్యాప్‌ను ముద్దాడి స్పెషల్ మూమెంట్‌ను సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో భావోద్వేగానికి గురైన శ్రేయస్‌ను ఆటగాళ్లంతా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ షేర్ చేయగా వైరల్ అవుతోంది. కాగా శ్రేయస్ అయ్యర్ 2017లో టీమిండియా తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు.ఇప్పటి వరకు 32 టీ20 మ్యాచ్‌లు, 22 వన్డేలు ఆడాడు. వరుసగా 580, 813 పరుగులు సాధించాడు. ఇక ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 54 మ్యాచ్‌లలో 4592 పరుగులు చేశాడు. ఇందులో 12 బసెంచరీలు, 23 అర్థ సెంచరీలు ఉన్నాయి. ఇక ఐపీఎల్‌లో ఢిల్లీ ఫ్రాంఛైజీ కెప్టెన్‌గా వ్యవహరించి శ్రేయస్ అయ్యర్.. 2021 సీజన్‌లో రిషభ్ పంత్ ఢిల్లీ పగ్గాలు చేపట్టడంతో ఆటగాడిగా కొనసాగాడు. కరోనా నేపథ్యంలో యూఏఈ వేదికగా జరిగిన రెండో అంచెకు అందుబాటులోకి వచ్చిన అయ్యర్... 175 పరుగులు చేశాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**